# వేట

వీర్రెడ్డికి వేటంటే సరదా... కొండంత పిరికి కూడా – మరంచేత ఎర్రయ్యను చేరదీశాడు. ఎర్రయ్య మంచి వేటగాడు. తుపాకీ పట్టినాడంటె పులైనా గిలగిల తన్నుకోవాల్సిందే. తుపాకి లేకుండానైతే గుద్దుకు ముగ్గుర్ని నెత్తురు కక్కించగలడు. ఈ రెండూ వీర్రెడ్డికి అవసరమనిపించాయి. మొదటిపని జంతువుల వేట – రెండవ పని మనుషుల వేట.

వీర్రెడ్డి మనుషుల వేటలో ఆరితేరి, ధనధాన్యాదులేకాక మరిన్ని భూములు తన భూముల్లో కలుపుకోగలిగాడు. జంతువుల వేటలో ఆరితేరి, బోలెడు కీర్తి గడించాలని అతని తాపత్రయం.

అదే తాపత్రయంతో చాలాసార్లు వేటకు ఎర్రయ్యతో కలసి వెళ్లాడు. కాని అదేమి విచిత్రమో ఎప్పుడూ కుందేళ్లు తప్ప జింకలు కూడా కనిపించలేదు– "కనీసం దుప్పి కొమ్ములన్నా గోడలకు బిగించనిది ఛీ బతికెందుకు?" అనుకున్నాడు. అతని బెడ్‌రూంలో ఏనాటిదో తండ్రి ఫోటో పక్కన చచ్చిపడున్న పెద్దపులిని చూసి చూసి విసుగొచ్చింది. ఎన్నిసార్లు ముహూర్తాలు వేదమూర్తులైన బ్రాహ్మణోత్తములతో నిర్ణయించుకొని వేటకు వెళ్లినా ఫలితం దక్కలేదు.

మరింక వీర్రెడ్డి మంచి షికారీ అనే కీర్తి లేకుండా బతకడం ఉత్త వేస్టని నిర్ణయించుకొని, జీపేసుకొని ఎర్రయ్యను వెంటబెట్టుకొని రాత్రిళ్లు అడవుల వెంట తిరగసాగాడు.

అలాంటి సమయంలో ఒకసారి– ఆకాశం కడిగిన గంగాళంలా స్వచ్ఛంగా ఉన్నది. వెన్నెల పిండారబోసినట్లుగా ఉన్నది. చుక్కలు చంద్రుడితో పోటీ పడలేకపోతున్నాయి. కీకారణ్యంలో జీపాపి ఎర్రయ్యను కిందికి దిగమన్నాడు వీర్రెడ్డి... డ్రైవరుకు బీడీ కుతి లేసిందేమో టక్కున జీపు ఆపేసిండు. అప్పటివరకు ఇరవై మైళ్లు తిరిగినా చెవులపిల్లి కూడా దొరకలేదు.

"ఒరే ఎర్రిగా..."

"అయ్య బాంచెన్...."

"తుపాకి నా చేతికియ్యి" అన్నాడు హఠాత్తుగా వీర్రెడ్డి. ఎర్రయ్య తుపాకి వీర్రెడ్డి చేతికందించి దిక్కులు చూడసాగాడు. వెన్నెల చెట్ల కొమ్మల సందునుంచి అక్కడక్కడ నంగనాచిలా పడుతోంది. ఎక్కడో అడివికోడి కూసినట్టు శబ్దం... ఎర్రయ్య పాము చెవులు రిక్కించిండు.

"ఏదో సప్పుడత్తంది దొర...."

"గదేరా... గటుచూడు..." వీర్రెడ్డి

ఎర్రయ్య అటువేపు చూసిండు. టార్చిలైటు వెలుతురులాగా తవిసిచెట్టు చాటునుంచి రెండు కళ్లు మెరుస్తున్నాయి. డ్రైవరు జీపు లైట్లు తీసేసి సెర్చిలైటు పట్టుకొచ్చాడు. సెర్చిలైటు ఆన్ చేశాడు కానీ ఏమీ కనిపించలేదు.

"పులాస నత్తంది దొరా?" ఎర్రయ్య ఎద్దులాగా శ్వాస ఎగపీలుస్తూ....

"ఆఁ..." వీర్రెడ్డి చేతులు వణికినయ్. డ్రైవరు తవిసిసెట్టు మొదట్లోకి సెర్చిలైట్ ఫోకస్ చేయడం, పులి గాండ్రుమనడం, వీర్రెడ్డి చేతిలో తుపాకి జారిపోవడం ఒక్కసారే జరిగాయి.

ఎర్రయ్య కిందబడ్డ తుపాకి తీసుకొని ముందుకురికాడు. వీర్రెడ్డి కళ్లు భయంతో మూసుకుపోయాయి. పులి లైటు వెలుతురులోనికి దుమికింది. డ్రైవరు కంగారుపడి లైటు ఆఫ్ చేశాడు... అంతలోనే తుపాకి "ఢాం" అని పేలింది... పులి అడివి దద్దరిల్లేటట్టు గాండ్రించింది... పదిహేను నిమిషాల తరువాత...

పులి పక్కన వీర్రెడ్డి నిలుచున్నాడు. ఇంకా పులి నుదురులో నుండి రక్తం కారుతోనే ఉన్నది.

వీర్రెడ్డి మీసాలమీద చెయ్యేసి–

"ఒరే ఎర్రిగా..."

"బాంచెన్..."

"పులిని గొట్టిందెవర్రా?"

"తమరే బాంచెన్..."

వీర్రెడ్డి కులాసాగా వీరునిలాగా నవ్విండు.

❖ ❖ ❖

వీరారెడ్డి బంగళాలో ఫారెస్టు రేంజర్ అర్ధగంట నుంచి "అడివి జంతువుల రక్షణ" గురించి లెక్చరిస్తున్నాడు.

చివరగా....

"చట్టరీత్యా పులిని చంపడం నేరం" ఫారెస్టు రేంజర్...

"కాదు మరి... పులంటే మాటలా....?" వీర్రెడ్డి.

"చంపింది నువ్వే కాదురా!" ఫారెస్ట్ రేంజర్

"ఆడికి నేను మొత్తుకున్నాను వాడే... లమ్డికొడుకు'... వీర్రెడ్డి.

ఎర్రయ్య మాట్లాడాలనుకోలేదు... ఫారెస్టు రేంజర్ ఎర్రయ్యను అరెస్ట్ చేసి తీసుకవెళ్లాడు.

❖ ❖ ❖

అదే రోజు రాత్రి ఆప్తమిత్రులను, బంధువులను పిలిచి వీర్రెడ్డి పార్టీ యిచ్చి– పార్టీలో తను పులిని ఎట్లా వేటాడింది వర్ణించి చెప్పాడు.... బంధువులు, మిత్రులు వీర్రెడ్డిని అదేపనిగా బ్రాండి, విస్కీ సీసాలన్నీ ఖాళీ అయ్యేదాకా పొగిడారు.

❄

ఆంధ్రజ్యోతి వారపత్రిక 10-11-1979